సాక్షి జగిత్యాల

ఆదివారం । 28 । మే । 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధిలో శనివారం రద్దీ నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.



విజయవంతం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ అవతరణ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్పీ భాస్కర్ అన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వల్పంగా పెరిగిన గోదావరి



ధర్మపురిలో గోదావరి తీరం

ధర్మపురి: ఎగువ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో గోదావరినదిలో కొత్త నీరు చేరి ధర్మపురి వద్ద నీటిమట్టం పెరిగింది. పెరిగిన నీటితో గోదావరి జలకలను సంతరించుకుంది. సంతోషిమాత ఘాట్ ముందున్న ఉసిరిక వాగు వద్దకు నీరు చేరింది. దీంతో భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బందులు తప్పాయి.

ఈతవనాల పరిశీలన



అంతర్గాంలో ఈతవనాన్ని పరిశీలిస్తున్న డేవిడ్ రమాకాంత్, ఎక్సైజ్ ఉన్నతాధికారులు

జగిత్యాలక్రైం: గీతకార్మిక వృత్తిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నగరాల్లో నీరా విక్రయ సెంటర్లను ఏర్పాటు చేసిందని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ డెప్యూటీ కమిషనర్ డేవిడ్ రమాకాంత్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, కల్లెడ, ఎండపల్లి మండలం గుల్లకోట, మల్యాల, కొండాపూర్‌లోని ఈత, తాటివనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలతో రాష్ట్రంలో ఈత వనాలున్న ప్రాంతాల నుంచి నీరా సేకరించాలనే లక్ష్యంతో ఈత వనాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన ఈత నీరా సెంటర్‌లో భారీ ఎత్తున విక్రయాలు కొనసాగుతుండటంతో రాత్రి 8 గంటలకు నోస్టాక్ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు బయట ప్రాంతాల్లో గీత కార్మికుల నుంచి ఈత నీరాను సేకరించి సెంటర్ల ద్వారా విక్రయం చేపట్టేలా పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్యగౌడ్, జగిత్యాల, సరూర్‌నగర్, శంషాబాద్, మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరింటెండ్లు శ్రీధర్, రవీందర్‌రావు, సత్యనారాయణ, అరుణ్‌కుమార్, సీఐలు ప్రభాకర్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, ఎస్సై భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఓటర్ వెరిఫికేషన్ పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): గ్రామాల్లో ఓటర్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెవెన్యూ అధికారులు బీఎల్వోల సర్వేను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే బీఎల్వోలు నివృత్తి చేయాలన్నారు. మీసేవ కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఆన్‌లైన్ సెంటర్లలో ఫొటో ఓటరు జాబితా వెరిఫికేషన్ చేస్తున్నారని, ప్రతీ వ్యక్తి ఓటును ఆ పోలింగ్‌స్టేషన్ పరిధిని వారి కుటుంబసభ్యులకు తెలియపర్చకుండా మార్చవద్దని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు నూతన ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమీవేశంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఆర్ఐలు రాజేశ్, సురేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్‌లో (2023–24 సంవత్సరానికి సంబంధించి) మొదటి బ్యాచ్ ఐదునెలల ఫౌండేషన్ కోర్సు పోటీ పరీక్షల తరగతులు బోధించేందుకు ఆసక్తి గల అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో అనుభవం కలిగి పీజీలో కనీసం 55 శాతం మార్కులు, ఐదునెలల ఉచిత శిక్షణలో ఆంగ్లం, అర్థమెటిక్, రీజనింగ్, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, హిస్టరీ, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ తరగతులు బోధించేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే మెస్ క్యాటరింగ్ చేసేందుకు (100 మంది విద్యార్థులకు) కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థికి రోజుకు రూ.75 చొప్పున ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, స్నాక్స్, రాత్రి భోజనంతో పాటు వారానికి ఒకట్రెండు సార్లు కోడిగుడ్లు మెను ప్రకారం ఐదు నెలల పాటు నిరంతరం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అధ్యాపకులు, క్యాటరింగ్ యజమానులు దరఖాస్తు చేసుకోవాలని, మిగతా వివరాలకు 99592 64770 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పట్టుదల ఉంటే కోచింగ్ అక్కర్లే

సివిల్స్ ఎవరైనా సాధించవచ్చు

- లక్ష్యసాధనతో ముందుకు సాగాలి
- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- ప్రిపరేషన్ టైంలో సినిమాలు చూశా
- సీనియర్ల సలహాలు తీసుకున్నా..
- కుటుంబంలో టీచర్లు ఉండడం కలిసొచ్చింది
- 'సాక్షి'తో సివిల్స్ 94వ ర్యాంకర్ ఆవుల సాయికృష్ణ

సండే స్పెషల్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో పేద, ధనిక తేడాలేదు. ప్రతిభ ఉన్న ఎవరైనా కల నెరవేర్చుకోవచ్చు. ఏ పోటీపరీక్షైనా ఆన్‌లైన్‌లో బోలెడు కంటెంట్, మెటీరియల్ ఉంది. ప్రణాళిక, పట్టుదల ఉంటే కోచింగ్ అక్కర్లేదు. దినపత్రికలు చదవాలి. నోట్స్ తయారు చేసుకోవాలి. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి.' అని సివిల్స్ విజేత సాయికృష్ణ అన్నారు. కరీంనగర్‌కు తొలిసారిగా వచ్చిన ఆయన శనివారం 'సాక్షి'తో ముచ్చటించారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..



ఏడేళ్ల తపస్సు

- సివిల్స్ సాధించాలనేది నా చిన్ననాటి కల. దాన్ని సాకారం చేసుకునేందుకు ఏడేళ్లపాటు తపస్సు చేశాను. నేను పడ్డ కష్టానికి ఫలితం దక్కింది. సివిల్స్‌లో 94వ ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. నా సంతోషాన్ని మాటల్లో వర్ణించలేకపోతున్నాను. నేను నాలుగో తరగతిలో ఉన్నప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కలెక్టర్‌గా సుమితాడావ్రా వచ్చారు. ఆమె గురించి అందరూ గొప్పగా చెబుతుంటే విని స్ఫూర్తిపొందాను. మహిళా సివిల్ సర్వెంట్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆమె చేసిన అనేక కార్యక్రమాల ఫలితాలు నేడు నాలుగు జిల్లాల ప్రజ లు పొందుతున్నారు. కరీంనగర్‌పై ఆమె రాసిన 'పూర్ బట్ స్పిరిటెడ్ కరీంనగర్' పుస్తకం నాకు ప్రేరణనిచ్చింది.

కుటుంబమే పెద్ద అండ

- సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే సమయంలో మా కుటుంబమే అండగా నిలిచింది. మా నాన్న, మామయ్యలు, అత్తయ్యలు అంతా కలిసి ఎనిమిది మంది వరకు ప్రభుత్వ టీచర్లు ఉన్నారు. వారిని నిత్యం చూస్తూనే క్రమశిక్షణ అలవర్చుకున్నాను. వారి ద్వారా నిత్యం స్ఫూర్తి పొందేవాడిని. 2015లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వస్తే చేరకున్నా ఎవరూ ఏమీ అనలేదు. నా లక్ష్య సాధనకు వారంతా సపోర్ట్‌గా నిలిచారు. ఇంటికే పేపర్ వస్తుండడంతో చిన్నప్పటి నుంచే దినపత్రికలు చదవడం అలవాటుగా మారింది. ఈ అలవాటు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో ఎంతో ఉపయోగపడింది.



సాయికృష్ణకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు సునీత-లక్ష్మయ్య

తన కలనే మా కల

సాయి చిన్నప్పటి నుంచే ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెరిగాడు. అందుకోసం నిరంతరం శ్రమించాడు. తన కలను మా కలగానే అనుకుని అన్ని విధాలా సహకరించాం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అతను అడిగినవన్నీ సమకూర్చాం. 2017లోనే ఐసీఎల్ఎస్ వచ్చినా సంతృప్తి చెందలేదు. తన స్వప్నం సాకారం కోసం రాత్రింబవళ్లు శ్రమించాడు. చివరికి సాధించాడు. – ఆవుల లక్ష్మయ్య

ప్రైవేటు ఉద్యోగాన్ని వదులుకున్నాడు

2015లోనే నా కుమారుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సెలెక్ట య్యాడు. తల్లిదండ్రులుగా మేమెంతో ఆనందపడ్డాం. ఆకర్షణీయమైన ప్యాకేజీ చేతికి అందినా పక్కనబెట్టాడు. తన కలల వైపు అడుగులేశాడు. చివరికి నా కొడుకు తన కలను నెరవేర్చుకున్నాడు. ఈ రోజు ఇంకా సంతోషిస్తున్నాం. – ఆవుల సునీత

సొంతంగా నోట్స్

- వరంగల్ ఎన్ఐటీలో 2015లో బీటెక్ పూర్తయ్యింది. వెంటనే సివిల్స్ కోచింగ్ కోసం ఢిల్లీకి వెళ్లాను అక్కడ ఆరు నెలలు కోచింగ్ తీసుకున్న తర్వాత సొంతంగా ప్రిపేర్ అయ్యాను. సొంతంగా నోట్స్ తయారు చేసుకోవడం ద్వారా ఏ విషయంపైనైన పూర్తి అవగాహన కలుగుతుంది. దీని ద్వారా సివిల్స్ పరీక్షలో స్కోర్ పెరిగే అవకాశం ఉంది. 2017 సివిల్స్‌లో 728వ ర్యాంకుతో ఐసీఎల్ఎస్ వచ్చింది. అయితే నా లక్ష్యం ఐఏఎస్ కావడంతో అంతటితో సంతృప్తి చెందలేదు. ఐఏఎస్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యాను. రోజుకు 5 నుంచి 7 గంటలు చదివాను. సివిల్స్ ప్రిపేర్ అయ్యే క్రమంలో మా సీనియర్ తక్కల్లపల్లి యశ్వంత్‌రావు ఇచ్చిన సలహాలు చాలా ఉపయోగపడ్డాయి.

సోషల్ మీడియాకు దూరంగా..

- సివిల్స్ ప్రిపేర్ అయ్యే సమయంలో సోషల్‌మీడియాకు దూరంగా ఉన్నాను. కంటెంట్ కోసమే ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాను. అనవసరమైన వాటికి దూరంగా ఉంటూ లక్ష్య సాధనకు అవసరమైన సమాచారం కోసమే యూట్యూబ్, గూగుల్‌లో సెర్చ్ చేశాను. అది నాకు ఎంతగానో ఉపయోగపడింది. అప్పుడప్పుడు సినిమాలు కూడా చూశాను. కానీ పరిమితంగానే చూశాను. ఈ కాలం తల్లిదండ్రులు తమ పిల్లలకు పాఠశాల దశలోనే ఐఏఎస్, ఐఐటీ కోర్సులు అంటూ నేర్పిస్తున్నారు. ఇది కొంత ఇబ్బందికరమే. పాఠశాల, ఇంటర్ స్థాయిలో ఐఐటీ, ఐఏఎస్ కోచింగ్‌లు ఇప్పించడం సరికాదు. ప్రతీ విద్యార్థి తనకంటూ ప్రత్యేకమైన టాలెంట్ ఉంటుంది. అది తెలుసుకొని అటువైపు వెళ్తే సక్సెస్ అవుతారు. అయితే కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తెలుసుకోవడం ప్రతీ విద్యార్థికి అవసరమే. ఏ పోటీ పరీక్షలోనైన కరెంట్ అఫైర్స్‌పై పట్టు ఉంటేనే రాణించగలుగుతారు.

ఆన్‌లైన్‌లో మెటీరియల్ ఎక్కువే

- ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో అన్ని పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఆన్‌లైన్‌లో దొరుకుతుంది. ఆన్‌లైన్‌లో బ్లాగులలో సీనియర్స్ రాసిన కంటెంట్ పుష్కలంగా లభిస్తుంది. ఆ మెటీరియల్ సివిల్స్ ప్రిపేర్ అయ్యే వారికి చాలా ఉపయోగకరంగా ఉంది. ఇంగ్లిష్ వస్తేనే సివిల్స్ సాధిస్తామనే అపోహను వీడండి. ఇప్పుడు మన మాతృభాషలో కూడా పరీక్ష రాసే అవకాశం ఉంది. ఇంటర్వ్యూ సైతం మాతృభాషలోనే నిర్వహిస్తారు. కోచింగ్ తీసుకోవాలనే అపోహ, ఇంగ్లిష్ రాదనే భయం వీడితే ఎవరైన సివిల్స్ సాధించవచ్చు.

స్త్రీనిధి.. రికవరీ జాడేది?

- పక్కదారిపడుతున్న మహిళా సంఘాల రుణాలు
- గతంలో పలు ఘటనలు.. విచారణలో వెలుగులోకి..
- తాజాగా బీర్‌పూర్‌లో సుమారు రూ.11లక్షలు స్వాహా
- అవకతవకలు బయటపడుతున్నా పట్టించుకోని అధికారులు



జగిత్యాల: మహిళల సాధికారతకు ప్రభుత్వం స్త్రీనిధి రుణాలను విరివిగా అందజేస్తోంది. కాగా జిల్లాలో ఇటీవల కాలంలో స్త్రీనిధి సొమ్ము పక్కదారి పడుతోంది. అధికారుల విచారణలో అవకతవకలు బయటపడుతున్నా పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇందుకు బాధ్యులైన ఆర్పీలు, వీఏవోలకు నోటీసులు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. దీంతో మహిళా సంఘాల సభ్యులు లబోదిబోమంటున్నారు.

జిల్లాలో జరిగిన ఘటనలు

- ఇటీవల మెట్‌పల్లిలో ఓ మున్సిపల్ ఉద్యోగి సతీమణి ఆర్పీ సుమారు రూ.4 లక్షల వరకు కాజేసింది. ఈ విషయం అధికారుల విచారణలో సైతం బయటపడింది. అయినా ఇప్పటివరకు కనీసం ఒక రూపాయి కూడా కట్టలేదు.
- రాయికల్‌లో ఓ ఆర్పీ రూ.19 లక్షలు కాజేసినట్లు విచారణలో తేలగా, స్త్రీనిధి అధికారులు సంబంధిత పీడీకి లేఖ రాశారు. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయినా ఇప్పటివరకు రికవరీ మాత్రం కాలేదు.
- తాజాగా బీర్‌పూర్ మండలంలో మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధికి సంబంధించిన రుణాలు చెల్లించినా సంబంధించిన వీఏవోలు బ్యాంక్‌కు చెల్లించకపోవడంతో దాదాపు రూ.11 లక్షలు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఇందులో ముగ్గురు వీఏవోల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు.
- కోరుట్లలో సైతం బ్యాంక్ లింకేజీకి సంబంధించిన రుణాలు సుమారు రూ.10 లక్షలు పక్కదారి పట్టగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

సొంతానికి వాడకం

స్త్రీ నిధి రుణాలను మున్సిపల్ పరిధిలో ఆర్పీలు, గ్రామీణ ప్రాంతాల్లో వీఏవోలు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొంది వాటికి సంబంధించిన కిస్తీలను మున్సిపాలిటీలో మెప్మా విభాగంలోని ఆర్పీలకు, గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ విభాగంలోని వీఏవోలకు చెల్లిస్తున్నారు. కాగా, వీరు వాటిని స్త్రీనిధి బ్యాంక్‌లో కట్టకుండా దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

బయటపడిందిలా..

రాయికల్‌లో ఓ ఆర్పీ రూ.19.89 లక్షలు వాడుకున్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రతినెలా కిస్తీలు చెల్లించినా తన సొంతానికి వాడుకోవడంతో.. కిస్తీలు చెల్లించడం లేదని మహిళలపై స్త్రీనిధి అధికారులు ఒత్తిడి తెచ్చారు. తాము చెల్లిస్తున్నామని సంఘాల సభ్యులు అధికారులకు తెలపడం, చివరకు విచారణ చేపట్టగా ఆర్పీ అవకతవకలు బయటపడ్డాయి. తాజాగా బీర్‌పూర్ మండలంలో సైతం దాదాపు రూ.11 లక్షలు వీఏవోలు అవకతవకలకు పాల్పడడంతో ముగ్గురికి నోటీసులు ఇచ్చారు. అయితే సంఘాల సభ్యులు సకాలంలో కిస్తీలు చెల్లిస్తున్నా వీఏవోలు, ఆర్పీలు ఎలాంటి రశీదులు ఇవ్వడంలేదనే ఆరోపణలున్నాయి. కిస్తీలు చెల్లించినట్లు సభ్యుల వద్ద ఆధారం లేకపోవడంతో తాము చెల్లించామని చెప్పినా అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. విచారణలో అవకతవకలు బయటపడుతున్నా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిమ్మకుండిపోతున్నారు.

రికవరీలో నిర్లక్ష్యం

జిల్లాలో దుర్వినియోగం అయిన స్త్రీనిధి సొమ్ముపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాయికల్, సారంగాపూర్, మెట్‌పల్లి, బీర్‌పూర్, గొల్లపల్లి తదితర మండలాల్లో అవకతవకలు బయటపడినా ఇప్పటి వరకు రికవరీ చేసిన దాఖలాలు లేవు. ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో మహిళా సంఘాలు రుణాలు చెల్లించడంలో వెనుకబడుతున్నాయని, ఎందుకు కట్టడం లేదని మెప్మా అధికారులను ప్రశ్నించారు. అయినా రికవరీ విషయంలో అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఆర్ఆర్ చట్టం ఉపయోగిస్తాం

ఆర్ఆర్ (రెవెన్యూ రికవరీ) చట్టాన్ని ఉపయోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. స్త్రీనిధి రుణాలు సొంతానికి వాడుకున్న వారి నుంచి రికవరీ చేస్తాం. ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. సిబ్బంది పనితీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిధులు స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఆనందరావు, ఆర్ఎం, స్త్రీనిధి

తూకంలో మోసం.. రైతుల ఆందోళన



తూకం యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రైతులు



ఎలక్ట్రానిక్ కాంటాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని గణేశ్‌పల్లి కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసానికి పాల్పడుతున్నారని రైతులు ఆందోళనకు దిగారు. వివరాలు.. గణేశ్‌పల్లి కేంద్రంలో నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు సాగుతుండగా, ప్రస్తుతం చివరి దశకు చేరాయి. శుక్రవారం తూకం వేసిన ధాన్యం సంచులపై రైతులకు అనుమానం వచ్చింది. శనివారం మళ్లీ సదరు సంచులను వేరే యంత్రంపై తూకం వేయించారు. కేంద్రానికి సంబంధించిన మిషన్‌పై 41 కిలోలు చూపుతుండగా, వేరే మిషన్‌పై 43 కిలోలు చూపడంతో జరిగిన మోసాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్సీ కొనుగోలు కేంద్రానికి చేరుకొని పరిశీలించారు. తూకంలో వ్యత్యాసంపై సీఈవో ఇస్మాయిల్, సంఘం అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డిని ప్రశ్నించారు. అనంతరం అదనపు కలెక్టర్, సివిల్‌సప్లై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు భారీగా మోసపోయారని, వెంటనే విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని కోరారు.

నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కేంద్రానికి చేరుకుని సంచులను తూకం వేయించారు. వ్యత్యాసం కనిపించడంతో నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాగా అదనపు కలెక్టర్ ఆదేశాలతో గణేశ్‌పల్లి కేంద్రానికి తూనికలు కొలతల శాఖ అధికారులు చేరుకుని తూకం యంత్రాన్ని పరీక్షించారు. ఎలక్ట్రానిక్ కాంటా బ్యాటరీ లో కావడంతోపాటు ఇతర కారణాలతో తూకంలో వ్యత్యాసం వచ్చిందని గుర్తించి రైతులకు వివరించారు. ఈ విషయంపై సీఈవో, సంఘం చైర్మన్ మాట్లాడుతూ, రెండు రోజుల నుంచి తూకంలో జరిగిన వ్యత్యాసంపై రైతులకు నష్టం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

పెగడపల్లి(ధర్మపురి): యాదవసంఘం మాజీ అధ్యక్షుడు గంగుల కొమురెల్లిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 2018లో యాదవ సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తనకు రెండు గొర్రెల యూనిట్లు ఇప్పిస్తానని మోసం చేశాడని ఆరోపిస్తూ పెగడపల్లికి చెందిన తోడేటి లోకేశ్ శనివారం ఫిర్యాదుచేశాడు. లోకేశ్‌కు రెండు గొర్రెల యూనిట్లు ఇప్పిస్తానని కొమురెల్లి తెలపడంతో రూ. 1.5లక్షల డీడీని అతడి బ్యాంకు ఖాతాలో జమచేశాడు. ఈక్రమంలో తనకు గొర్రెల యూనిట్లు ఇప్పించకపోగా డబ్బులు చెల్లించాలని అడిగితే చంపుతానని బెదిరించాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

'దశాబ్దకాలంలో దగా పడిన తెలంగాణ'



జోడో యాత్రలో పొన్నం, ఆది తదితరులు

కథలాపూర్(వేములవాడ): దశాబ్దకాలంలో తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల పాలనలో దగా పడిందని, పదేళ్లలో ఆ కుటుంబం మాత్రమే 100 ఏళ్లకు సరిపడేలా అభివృద్ధి చెందిందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మేడిపెల్లి మండలకేంద్రంలో హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. పలు వాడల్లో రైతు, యూత్ డిక్లరేషన్‌ను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 2 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమవుతుందని, పదేళ్లలో రాష్ట్రంలో దళితులకు మూడెకరాలు భూపంపిణీ, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఎందుకు అమలు చేయడంలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముందుగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడిపెల్లి, కథలాపూర్ మండలాల అధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, కాయితి నాగరాజు, ప్రధానకార్యదర్శి శ్రీపతి దామోదర్, నాయకులు ఏనుగు రమేశ్‌రెడ్డి, దాసరి శంకర్, లచ్చ నాయక్, మార్గం నర్సారెడ్డి, ఉరుమడ్ల లక్ష్మణ్, నల్ల భూమారెడ్డి, తొట్ల అంజయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

జగిత్యాల: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జిల్లాలో వైభవంగా నిర్వహించాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ యాస్మిన్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి జూన్ 2 నాటికి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగుపెడుతుందని, 21 రోజులు పండగ వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖలు జూన్ 2, 2014 నుంచి చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, నియోజవవర్గ, మున్సిపాలిటీల్లో ఎక్కడెక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తారో కార్యాచరణ రూపొందించాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సంబంధిత ఆర్డీవోలు 21 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, రవిశంకర్, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు లత, మకరంద్, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

చీఫ్ మినిస్టర్ కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని మంత్రి ఈశ్వర్ అన్నారు. శనివారం జిల్లాలో జరిగిన సీఎం కప్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు బస్సులో హైదరాబాద్‌కు వెళ్లగా జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎస్పీ భాస్కర్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్‌కు పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న గడ్డం నర్సయ్య

సిరిసిల్లటౌన్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్‌ను శనివారం సిరిసిల్ల నేతలు పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ మాతృమూర్తి చనిపోయిన విషయం తెలిసిందే. నల్గొండలో ఉంటున్న శ్రీనివాస్‌ను జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల వేంకటేశ్వర ఆలయ మాజీ చైర్మన్ బైరి ప్రభాకర్, తోట రాజేందర్, పాషాఖాన్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై శేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మిస్సయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ యాప్ ద్వారా గుర్తించారు. బాధితునికి ఎస్సై శేఖర్ శనివారం అందించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన మస్కూరి రాజు తన సెల్‌ఫోన్ పోయిందని గతనెల 22న పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఐఎంఈఐ నంబర్ ద్వారా సీఈఐఆర్ యాప్‌లో నమోదుచేయగా.. సెల్‌ఫోన్ జాడ తెలిసింది. దీంతో సెల్‌ఫోన్‌ను రికవరీచేసి బాధితునికి ఎస్సై అందించారు. ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేయాలన్నారు. ఈ యాప్‌ను ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్‌లో వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

రాజ్యాంగ గ్రంథాలను ఇంటింటా పంపిణీ చేయాలి

ముస్తాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం గ్రంథాలను ప్రతీ పౌరుడికి అందించాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్‌లో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రచార కమిటీ సభ్యురాలు పరమేశ్వరి మాట్లాడుతూ.. గతంలో ఇంటింటికి రాజ్యాంగ గ్రంథాలను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ తరపున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరామన్నారు. ఇప్పటికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, దీనికి నిరసనగా రాజీవ్‌చౌక్‌లో ధర్నా చేపట్టామన్నారు. రాజ్యాంగం గ్రంథం అందిస్తే ప్రతీ పౌరుడు తమ హక్కులు, విధులు తెలుసుకోగలుగుతాడన్నారు. రాజీవ్ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా రాజ్యాంగ గ్రంథాలను ఇంటింటికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లావణ్య, బాబు, అరుణ్, విక్రమ్, సురేశ్, మధు, మహేశ్, గుండురావు తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరు నెలలు గడువు పెంపు

- పాఠశాల యాజమాన్య కమిటీల కొనసాగింపునకు ఉత్తర్వులు జారీ

> పెగడపల్లి: ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల గడువును మరో ఆరునెలలు పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. సాధారణంగా పాఠశాలల్లో విద్యార్థులు పదోతరగతి పూర్తయ్యాక వారి తల్లిదండ్రులు ఎస్ఎంసీ చైర్మన్ లేదా కమిటీ సభ్యులుగా ఉంటే వారిస్థానంలో కొత్త వారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం తాజాగా జారీచేసిన ఉత్తర్వుల్లో ప్రస్తుతం కమిటీలో ఉన్న వారినే మరో ఆరు నెలలు కొనసాగించాలని నిర్ణయించింది.



పెగడపల్లి ఆదర్శ మోడల్ స్కూల్

జిల్లాలో 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 274 పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రస్తుతమున్న ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యుల తీర్మానాలతో పనులు కొనసాగుతున్నాయి ఈక్రమంలో మధ్యాహ్నం భోజనం నిర్వహణతో పాటు ప్రతీ సంక్షేమ పథకంలో ఎస్ఎంసీలకు బాధ్యతలు అప్పగించి, పర్యవేక్షించేలా ప్రభుత్వం అధికారం ఇచ్చింది.

ఎస్ఎంసీ చైర్మన్లకు అధికారం..

జగిత్యాల జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 779 ఉన్నాయి. ఇందులో 509 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 185 ఉన్నత పాఠశాలలున్నాయి. మంజూరైన నిధులతో మన ఊరు– మన బడి పనులు కొనసాగుతున్నాయి. తొలి విడతలో 274 పాఠశాలను ఎంపికచేశారు. ఇందుకు గానూ సుమారు రూ.116.33 కోట్లు మంజూరుకాగా విద్యాశాఖ నుంచి రూ.73.03 కోట్లు, ఉపాధిహామీ నుంచి రూ.11.39 కోట్లు, ఫర్నీచర్, ఇతర సదుపాయాల కల్పనకు రూ.31.90 కోట్లు మంజూరు చేశారు. ఇందులో 145 ప్రాథమిక, 24 ఉన్నత ప్రాథమిక, 105 ఉన్నత పాఠశాలల్లో పనులు చేపట్టారు. ఈ పనులు చేసేందుకు పలుచోట్ల కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయా పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు లేదా సర్పంచులు అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఈ పనులకు సంబంధించిన నిధులు ప్రస్తుత చైర్మన్, హెచ్ఎం జాయింట్ ఖాతాల్లోకి వస్తున్నాయి. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో ఎలాంటి ఆటంకం కలుగకుండా ఉండేందుకు వారి పదవీ కాలాన్ని పొడిగించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా పలు అభివృద్ధి పనుల్లో నాణ్యత, ఇతర అంశాలపై పరిశీలించడానికి ఎస్ఎంసీ చైర్మన్లకు అధికారం ఉంది.

779 మంది ఎస్ఎంసీ చైర్మన్లు..

జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు , కేజీబీవీల్లో ఎస్ఎంసీ చైర్మన్లు మొత్తంగా 779 మంది కొనసాగుతున్నారు. వారి పదవీ కాలం ఈనెల 30తో ముగియనున్న నేపథ్యంలో ఉన్నవారినే మరో ఆరునెలలు కొనసాగాలని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఈ ఏడాది నవంబర్ 30 వరకు కొనసాగనున్నాయి.

ఉత్తర్వులు అందాయి



ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యుల పదవీకాలం ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఏడాది నవంబర్ వరకు పాతవారినే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తిరిగి ప్రభుత్వం ఆదేశాల మేరకు కొత్త కమిటీల ఎంపిక డిసెంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

– జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో

మత్తుపదార్థాల నిర్మూలనకు చర్యలు



ఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఇటీవల ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో గంజాయి విక్రయిస్తున్న నిర్మల్ జిల్లాకు చెందిన శ్రీకాంత్, అజయ్‌ను పట్టుకున్న ఎస్సై ఉమాసాగర్‌ను, ఏఎస్సై ప్రకాశ్‌ను అభినందించి మాట్లాడారు. మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. మండలాలు, గ్రామాల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నామని, ఇతర జిల్లాల నుంచి వచ్చే గంజాయి మూలాలు, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై నిఘా వేస్తున్నామన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కళాశాలల్లో విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటుపడకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసిన వారి వివరాలను పోలీసుకుల తెలపాలని, లేదా డయల్ 100కు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



పట్టుబడిన గంజాయి విక్రేతలతో సీఐ లక్ష్మీ నారాయణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం గంజాయి విక్రేతలను పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. ఆయన తెలిపిపిన వివరాల ప్రకారం.. వేములకుర్తి శివారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారని సమాచారంతో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారినుంచి 400 గ్రాముల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన రాగుట్ల అజయ్, గొద్దుల శ్రీకాంత్ నిర్మల్ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఇక్కడి యువకులకు ఎక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా పట్టుకున్న గంజాయితో పాటు బైక్‌ను తహసీల్దార్ మహేశ్వర్ ఎదుట సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీ నారాయణ తెలిపారు.

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం



మంత్రిని సన్మానిస్తున్న క్రిస్టియన్స్

ధర్మపురి: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో శనివారం నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ క్రైస్తవుల పట్ల చూపుతున్న ఆదరాభిమానాలు విలువ కట్టలేనివని ప్రశంసించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎడ్ల చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని రాయపట్నం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుద్ధ తిరుపతి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభించేదెప్పుడో!

- చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి
- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి/వెల్గటూర్: చిరువ్యాపారుల సౌకర్యార్థం నిర్మించిన సమీకృత ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. ధర్మపురి పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో శనివారం చిరువ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను లక్ష్మణ్ అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో సుమారు రూ.3 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేశారని అన్ని వసతులు కల్పించి ఆరునెలలు గడుస్తున్నా ప్రారంభించడంలో జాప్యంచేస్తున్నారని ఆరోపించారు. ప్రతీరోజు మార్కెట్ వచ్చే చిరువ్యాపారులు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ తాగునీరు లేక, బాత్‌రూంలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.దినేశ్, ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్, నాయకులు రాందేని మొగిలి, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, కస్తూరి శ్రీనివాస్, స్తంభంకాడి గణేశ్ తదితరులున్నారు.

రైతుల బాధలు మంత్రికి పట్టవా?

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కనిపించడం లేదని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. వెల్గటూర్ మండలం వెంకటాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. 45 రోజులు దాటినా ధాన్యం కొనుగోళ్లు 50 శాతం కూడా పూర్తి కాలేదని విచారం వ్యక్తంచేశారు. చివరి గింజ వరకూ కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, కోతలు విధించిన మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా, ఇప్పటికీ ఏ మిల్లర్ పైనా చర్యలు తీసుకోలేదన్నారు. లారీలు సక్రమంగా రాకపోవడంతో తూకం వేసిన బస్తాలు కేంద్రాల్లోనే ఉంటున్నాయని, లారీలను రప్పించి ధాన్యం మిల్లులకు తరలించాలని, వర్షాలు రాక ముందే ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర అవతరణ ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



జగిత్యాలక్రైం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుంచి 22 వరకు సాగుతాయని పేర్కొన్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు.

జూన్ 4న సురక్షా దినోత్సవం

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి, స్నేహపూర్వక విధానం, సమర్థవంతమైన సేవలను వివరించేలా కార్యక్రమాలు ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసుశాఖలో జరిగిన సంస్కరణలు, వాటి విశిష్టతను సభలు, కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. జూన్ 12న ఉదయం 6 గంటలకు నిర్వహించే తెలంగాణ రన్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడలు, యువజన సర్వీసులశాఖ వారితో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. సమావేశంలో డీఎస్పీలు ప్రకాష్, రవీంద్రారెడ్డి, రవీంద్రకుమార్, సీఐలు రాజశేఖర్‌రాజు, శ్రీనివాస్, సరిలాల్, నాగేశ్వరరావు, కోటేశ్వర్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, రమణమూర్తి, ఆర్ఐలు వామనమూర్తి, నవీన్ పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన గల్ఫ్ జేఏసీ నాయకులు



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను మేడిపెల్లి మండలానికి చెందిన గల్ఫ్ జేఏసీ నాయకుడు శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను విన్నవించామన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్, కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

పెగడపెల్లి: పెగడపెల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన పెంజర్ల మల్లేషం అనే వ్యక్తి తన భార్యాపిల్లలు కనిపించడం లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం పిర్యాధు చేశాడు.వివరాలిలా ఉన్నాయి.మల్లేషం భార్య సుజాత,కూతురు వైష్ణవి ఇద్దరు శుక్రవారం ఉదయం ఇంట్లో నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారని అప్పటి నుండి తిరిగి ఇంటికి రాలేదని పిర్యాధులో పేర్కొన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

డివైడర్‌పైకెక్కిన లారీ

- తప్పిన పెను ప్రమాదం
- నిద్రమత్తులో డ్రైవర్



డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని నిజామాబాద్‌రోడ్ నటరాజ్ థియేటర్ చౌరస్తా వద్ద శనివారం తెల్లవారుజామున లారీ డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో లారీ రోడ్డు మధ్యలోని డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లడంతో సెంట్రల్ లైటింగ్ పోల్ విరగడంతో పాటు, డివైడర్లు కూలిపోయాయి. ఈ ప్రమాదంతో సుమారు గంటపాటు నిజామాబాద్-జగిత్యాల రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. మున్సిపల్ అధికారుల ఫిర్యాదుతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



కాలిపోయిన బోరు మోటార్

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామం పటేల్ చెరువు సమీపంలోని పొలాల్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి సుమారు 50ఎకరాల్లో మంటలు వ్యాపించాయి. దీంతో పొలాల్లోని పశుగ్రాసంతో పాటు బోరుమోటార్లు, పైపులు, కరెంట్ తీగలు కాలిపోయాయి. నష్టం రూ.లక్షల్లో ఉంటుందని ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని రైతులు కోరారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర నాయకుడు చెన్న విశ్వనాథం డిమాండ్
- ఖాళీ స్థలాల వద్దకు నిరుపేదలతో ర్యాలీ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత చెన్న విశ్వనాథం

కోరుట్లటౌన్: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్రనాయకులు చెన్న విశ్వనాథం, వెన్న సురేశ్, సుతారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని రారాజు ఫంక్షన్ హాలులో సీపీఐ ఆధ్వర్యంలో ఇల్లులేని నిరుపేదలతో సమావేశం నిర్వహించారు. పట్టణ శివారులో ప్రభుత్వభూమిని రెవెన్యూ అధికారులు సర్వేచేసి, అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ నుంచి ప్రభుత్వ స్థలాల వరకు ర్యాలీగా వెళ్లి ఎర్రజెండాలు పాతారు. ప్రభుత్వాధికారులు స్పందించకపోతే గుడిసెలు వేస్తామని పేర్కొన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు భూపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్నం రాధ, రామిళ్ల రాంబాబు, సాంబార్ మహేశ్, చాంద్‌పాషా, గుండేటి పోశెట్టి, దాసరి మనోహర్, అందె వంశీకృష్ణ, మ్యాదరి గణేశ్, నిరుపేద మహిళలు పాల్గొన్నారు.

లారీ నుంచి జారిపడిన ధాన్యం బస్తాలు



లారీ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై రాము



నడిరోడ్డుపై లారీ నుంచి కిందపడిన ధాన్యం బస్తాలు

- ట్రాఫిక్‌కు అంతరాయం

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని కరీంనగర్‌రోడ్‌లో శనివారం ప్రధాన రోడ్డుపై మధ్యాహ్నం లారీ నుంచి ధాన్యం బస్తాలు కింద పడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇబ్రహీంపట్నం మండలం గోధూరు ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి కొడిమ్యాల మండలం పూడూరు రైస్‌మిల్లుకు ధాన్యం బస్తాలు తీసుకెళ్తున్న లారీ జయశంకర్ విగ్రహం వద్దకు రాగానే ధాన్యం బస్తాలు జారీకింద పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా అక్కడే వదిలేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై రాము అక్కడకు వెళ్లి లారీ డ్రైవర్‌తో మాట్లాడి హమాలీలను రప్పించాడు. ధాన్యం బస్తాలను లోడ్ చేయించి లారీని పంపించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

జగిత్యాలజోన్: విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి రూ 39,360 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి నారాయణ శనివారం తీర్పునిచ్చారు. విజిలెన్స్ సీఐ స్వామి కథనం ప్రకారం.. మెట్‌పల్లి మండలం రంగారావుపేటకు చెందిన సంగెపు గంగాధర్ తన ఇంటికి ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్‌ను వాడుకోవడంతో, సెస్ అధికారులు పట్టుకుని విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొదటి నేరం కింద రూ.1000 జరిమానా విధించారు. అయినప్పటికీ, గంగాధర్ తీరులో ఏలాంటి మార్పు రాలేదు. తిరిగి ఆక్టోబర్ 15, 2019న మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు పట్టుకుని విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. విచారణ చేపట్టిన జడ్జి గంగాధర్‌కు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించకపోతే ఐదు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పువెళ్లడించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్సై నిరంజన్‌రెడ్డి, టి.నరేశ్‌ను విజిలెన్స్ సీఐ స్వామి అభినందించారు.

విధులకు ఆటంకం కలిగించిన దంపతులపై కేసు

సిరిసిల్లక్రైం: పోలీసు అధికారిపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేయడంతోపాటు కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ శనివారం తెలిపారు. ఈమేరకు సీఐ మీడియాతో మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన కాత మల్లేశం ఇటీవల జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. పోలీసులు కావాలని తనను జైలుకు పంపించారన్న కోపంతో సంబంధిత స్టేషన్ ఎస్సైపై సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు చేశాడు. అంతేకాకుండా ఇదే ఊరిలో మరో కేసు విషయంలో విచారణ కోసం కానిస్టేబుల్ మాలోతు చందు శనివారం వెళ్లాడు. గమనించిన కాత మల్లేశం, అతని భార్య సుమలత కానిస్టేబుల్‌ను దుర్భాషలాడారు. తమపై కేసు నమోదు చేసి మళ్లీ ఊరికి ఎలా వస్తారని ప్రశ్నించారు. ఊరిలోకి పోలీసులు రావడానికి వీలులేదని, తమను కాదని వస్తే అంతు చూస్తానని ఫొటోలు తీశారు. మల్లేశం అతని భార్య సుమలత తన విధులకు ఆటంకం కలిగించి, బెదిరించినట్లు కానిస్టేబుల్ మాలోతు చందు ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

ఇదే మా 'బలగం'



రాయికల్: చిన్నచిన్న మనస్పర్థలు, అంతులేని ఆలోచనలు, మదినిండ కల్మషంతో కుటుంబాల్లో కలహాలు రేపి దూరమవుతున్న బంధుత్వాలు నిత్యం మనకు కనిపిస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో ఒకే కుటుంబానికి చెందిన 60 మంది కుటుంబ సభ్యులంతా బలగంలా మారి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాయికల్ మండలం రామాజీపేటకు చెందిన అరిగెల సత్తవ్వ (95) జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. సత్తవ్వకు నలుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒకే వేదికపై 60 మంది కుటుంబ సభ్యులంతా కలిసి సత్తవ్వ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ బలగం మరింత మందికి ఆదర్శంగా నిలిచేలా ఇలా తమ జ్ఞాపకాన్ని ఫోటోరూపంలో భద్రపర్చుకున్నారు.